గ్రేటర్‌లో కాంగ్రెస్‌ను మరింత పటిష్ఠం చేయాలి

● మీనాక్షి నటరాజన్



మీనాక్షి నటరాజన్‌తో హైదరాబాద్ ఏఎంసీ చైర్ పర్సన్ లక్ష్మి తదితరులు

చాదర్‌ఘాట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మిలు గాంధీభవన్‌లో మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా తమిళనాడు ఎంపీ విశ్వనాదన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌ను కలిసినట్టు వారు తెలిపారు.

ఎన్ఐఐఎంహెచ్ చేరుకున్న ఆయుర్వేద ప్రచార రథయాత్ర

సైదాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న రెండవ ప్రపంచ ఆయుర్వేద శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రచార రథయాత్ర శుక్రవారం గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఐఎంహెచ్)కు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రచార రథంలో ధన్వంతరి పూజను సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డా.జేపీ ప్రసాద్ నిర్వహించారు. అనంతరం రథయాత్ర తిరిగి ప్రారంభమైంది. ఈ యాత్ర ఏడు రాష్ట్రాల మీదుగా బెంగళూరుకు చేరుకోనుంది.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి అధికారులకు సూచించారు. ముసారాంబాగ్ డివిజన్‌లోని పెద్ద బజార్ బస్తీలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. రూ.20లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు కార్పొరేటర్ వివరించారు. వారం రోజుల్లోగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డిని ఆదేశించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, నాయకులు రాము యాదవ్, చందు, దీపక్, సాదిక్, పర్శరాంనాయక్, సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో కార్పొరేటర్ అన్నదానం

మన్సూరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లోని స్పందన పాలాది పరమేశ్వర్ వృద్ధాశ్రమంలో జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం అన్నదానం చేశారు. అంతకుముందు ఏపీలోని కోటప్పకొండ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, భీమనపల్లి సిద్ధు, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లు మంగారెడ్డి, నాయకులు జగన్, గోపియాదవ్, జాకీర్, శ్రీను, కృష్ణంరాజు, సాయి, కేఎన్ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● జోస్ ఆలుక్కాస్ మేనేజర్ జీతోష్

కొత్తపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ శాఖ జోస్ ఆలుక్కాస్ జువెలరీ మేనేజర్ జీతోష్ అన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ మండల ప్రాథమిక పాఠశాలకు 5 బెంచీలు, 6 సీలింగ్ ఫ్యాన్లు, 12 ప్లాస్టిక్ కుర్చీలను శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు జువెలరీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అరుణజ్యోతి, సంధ్య, అంజనాదేవి తదితరులు పాల్గొన్నారు.


మురుగు నీటి పారుదలకు చర్యలు

● కార్పొరేటర్ పవన్‌కుమార్



మారుతీనగర్‌లో మురుగు సమస్యను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

కొత్తపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మారుతీనగర్‌లో మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన జలమండలి అధికారులతో కలిసి మారుతీనగర్‌లో మురుగు సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనావాసాలు తక్కువగా ఉన్నప్పుడు వేసిన డ్రైనేజీ పైపులైన్‌తో తరచూ మురుగు లీకేజీ సమస్య తలెత్తుతోందన్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఎక్కువ సామర్థ్యం గల పైపులైన్ వేయాలని అధికారులకు ఆయన సూచించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జలమండలి జీఎం బలరాం తెలిపారు. అనంతరం మోహన్‌నగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులనూ, రామలింగేశ్వర కాలనీలో వరద నీటి కాల్వ పనులనూ కార్పొరేటర్ పవన్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సుందర్ నారాయణ, నాయకులు శ్రీధర్, వెంకటేష్, జలమండలి డీజీఎం రవీంద్రనాథ్ వర్మ, ఏఈ స్రవంతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి: కార్పొరేటర్

చంపాపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చంపాపేట చౌరస్తాలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చంపాపేట చౌరస్తాలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ కోసం చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను సాగర్ ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ ఈఈ కార్తీక్, డీఈ రఫీ, ఏఈ సురేష్, స్థానికులు శ్రీశైలం, అంజి, జగన్, నరేష్, శివరాజ్, రవీందర్, ప్రభాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

టెర్రస్‌పై గంజాయి మొక్కల పెంపకం: ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై గంజాయి మొక్కలు పెంచి, వాటిని ముక్కలుగా కత్తిరించి విక్రయిస్తున్న ఇద్దరు బిహార్‌కు చెందిన వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన లవకుశ, భీమ్లేష్‌లు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మలక్‌పేట్‌లోని ఓ భవనంలో అద్దెకు ఉంటున్నారు. గంజాయికి ఉన్న డిమాండ్‌ను గుర్తించిన వీరు టెర్రస్‌పై గంజాయి మొక్కలు పెంచడం ప్రారంభించారు. ఐదునెలలుగా పెంచిన మొక్కలు 6మీటర్ల ఎత్తుకు చేరుకున్నాయి. ఈ మొక్కలను కత్తిరించి కస్టమర్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వారి ఇంటిపై దాడి చేశారు. లవకుశ, భీమ్లేష్‌లను అరెస్ట్ చేసి, టెర్రస్‌పై పెంచిన ఐదు గంజాయి మొక్కలు, 55 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నాడు పల్లెలు.. నేడు పట్టణాలు

జీహెచ్ఎంసీలో కలిసిన పల్లెలు

● సరూర్‌నగర్‌లో 13, హయత్‌నగర్‌లో 15జీపీలు గ్రేటర్‌లో విలీనం

● హయత్‌నగర్‌లో మిగిలింది 12 పంచాయతీలే



సరూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం (ఫైల్)



హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం(ఫైల్)

హయత్‌నగర్/సరూర్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అవన్నీ మారుమూల పల్లెలు.. గ్రామాల్లో ఓ సర్పంచ్, కొందరు వార్డు సభ్యులు.. మండలంలో ఓ ఎంపీపీ, కొందరు ఎంపీటీసీలు, మండలానికో జడ్పీటీసీ సభ్యుడు.. ఇదీ నగర శివారులోని హయత్‌నగర్, సరూర్‌నగర్ మండలాల నాటి పరిస్థితి! కానీ.. నేడు అదంతా గతంగా మిగిలిపోనుంది. నాటి పల్లెలు కొత్తగా పట్టణీకరణ సంతరించుకుని 'మహానగరం'లో అంతర్భాగంగా మారిపోయాయి. 1956 నుంచి మలక్‌పేట్ నియోజకవర్గంలో భాగంగా ఉన్న ఆయా మండలాల్లోని గ్రామాలు.. క్రమక్రమంగా రూపాంతరం చెందుతూ.. నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, ఆ తర్వాత నగర పాలక సంస్థలుగా మారి.. తాజాగా 'హైదరాబాద్ మహానగర పాలక సంస్థ'లో కలిసి పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న విలీనం నిర్ణయంతో నాటి శివారు మండలాల్లోని ఆయా గ్రామాలన్నీ గ్రేటర్‌లో చేరి కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. సరూర్‌నగర్ మండలంలోని మొత్తం 13 గ్రామ పంచాయతీలు కాలగర్భంలో కలిసిపోగా.. హయత్‌నగర్ మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గాను 15 పంచాయతీలు గ్రేటర్‌లో కలవగా.. 12 గ్రామ పంచాయతీలు మాత్రమే మిగిలాయి. కొత్త పంచాయతీల ఏర్పాటులో భాగంగా ఇంకో మూడు గ్రామ పంచాయతీలు రావడంతో ఆ సంఖ్య 15కు చేరింది.

గ్రేటర్‌లో పూర్తిగా సరూర్‌నగర్ విలీనం..

సరూర్‌నగర్ మండలంలోని ఏడు గ్రామాలతో (బాలాపూర్ పార్ట్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, వెంకటాపూర్, మామిడిపల్లి) 2013లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం బడంగ్‌పేట్ నగర పంచాయతీని ఏర్పాటు చేసింది. 2014లో మునిసిపల్ ఎన్నికలు జరిపి మొదటి పాలకవర్గాన్ని ఎన్నుకుంది. 2019లో దీనిని నగర పాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేసి 2020లో ఎన్నికలు నిర్వహించారు. ఇక మిగిలిన ఐదున్నర గ్రామాలతో (బాలాపూర్ పార్ట్, మీర్‌పేట్, జిల్లెలగూడ, జల్‌పల్లి, కొత్తపేట్, పహాడీషరీఫ్) కొనసాగిన సరూర్‌నగర్ మండలానికి కూడా 2014లోనే స్థానిక ఎన్నికలు నిర్వహించి మండల పరిషత్ పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. పంచాయతీ ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు. అనంతరం 2016లో మండల పరిషత్ పాలకవర్గం ఉండగానే మీర్‌పేట్, జిల్లెలగూడ, జల్‌పల్లి(పహాడీషరీఫ్, కొత్తపేట్, జల్‌పల్లి, బాలాపూర్ పార్ట్‌తో కలిపి) మునిసిపాలిటీలను ఏర్పాటు చేశారు. 2019లో మీర్‌పేట్, జిల్లెలగూడలను కలిపి 'మీర్‌పేట్' పేరుతో ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేసి జల్‌పల్లిని మునిసిపాలిటీగా అలాగే ఉంచారు. జల్‌పల్లి మునిసిపాలిటీ, మీర్‌పేట్ కార్పొరేషన్‌కూ 2020లో ఎన్నికలు నిర్వహించగా మొదటి పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. బడంగ్‌పేట్, మీర్‌పేట్, జల్‌పల్లి పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జనవరి 26తో ముగియగా.. మళ్లీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేకాధికారుల పాలన పెట్టి.. తాజాగా ఈ నెల 3న జారీ చేసిన జీవోతో గ్రేటర్‌లో విలీనం చేశారు. దాంతో మండలంలోని నాటి 13 గ్రామాలు మాయమై నేడు పట్టణంలో కలిసిపోయినట్టయింది.



ప్రస్తుతం గ్రేటర్‌లో కలిసి సర్కిల్‌గా మారిన బడంగ్‌పేట్

4 గ్రామాలతో పెద్దఅంబర్‌పేట్, 9 గ్రామాలతో తుర్కయాంజాల్

హయత్‌నగర్ మండలంలోని 4 గ్రామాలతో(పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు, పసుమాముల, తట్టిఅన్నారం) 2013లో పెద్దఅంబర్‌పేట్ నగర పంచాయతీ ఏర్పాటు చేశారు. 2024లో హయత్‌నగర్ మండలంలోని మరో నాలుగు గ్రామాలను(అబ్దుల్లాపూర్‌మెట్, కుత్బుల్లాపూర్, బాచారం, గౌరెల్లి) ఇందులో కలిపేశారు. అనంతరం 2025లో దేశ్‌ముఖ్ గ్రామ పంచాయతీలోని సాయినగర్‌ను సైతం పెద్దఅంబర్‌పేట్‌లో విలీనం చేశారు. కాగా సదరు తొమ్మిది గ్రామాలతో ఉన్న ఈ మునిసిపాలిటీని తాజాగా గ్రేటర్‌లో విలీనం చేసి, ఎల్బీనగర్ జోన్‌లో కలపడంతో ఇక్కడ మున్సిపల్ శకం ముగిసినట్టయింది. మొత్తం మీద పెద్దఅంబర్‌పేట్ పదేళ్ల పాటు మున్సిపల్ పాలనను చవిచూసింది. ఇక మండలంలోని మరో తొమ్మిది గ్రామాలతో(తుర్కయాంజాల్, రాగన్నగూడ, కమ్మగూడ, ఇంజాపూర్, బ్రాహ్మణపల్లి, తొర్రూర్, కోహెడ, మునగనూరు, ఉమర్‌ఖాన్‌దాయర) కలిపి 2019లో తుర్కయాంజాల్ పేరుతో కొత్త మునిసిపాలిటీని ఏర్పాటు చేశారు. 2018లో ఆయా గ్రామాల్లో పంచాయతీల పదవీకాలం ముగియగా.. రెండేళ్ల పాటు ప్రత్యేకాధికారుల పాలన పెట్టి.. అనంతరం 2020లో మునిసిపల్ ఎన్నికలు నిర్వహించారు. 2025 జనవరి 26తో పాలకవర్గం దిగిపోగా.. అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలన పెట్టి.. తాజాగా జీహెచ్ఎంసీలో విలీనం చేశారు.



గ్రేటర్‌లో కలిసి సర్కిల్‌గా మారిన పెద్దఅంబర్‌పేట్

నగర వాతావరణానికి అలవాటు పడాల్సిందే..

వాస్తవానికి ఈ రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో నేటికీ పల్లె వాతావరణం కొట్టిచ్చినట్టు కనిపిస్తోంది. మరో పదేళ్ల పాటు మునిసిపాలిటీలుగా కొనసాగించి ఆ తర్వాత పూర్తి స్థాయిలో పట్టణీకరణ సంతరించుకున్న తర్వాత గ్రేటర్‌లో విలీనం చేస్తే బాగుండేదనే అభిప్రాయం ఆయా మండలాల్లోని ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. అయితే ప్రభుత్వం గట్టి నిర్ణయమే తీసుకున్నట్టు రికార్డుల స్వాధీనాన్ని బట్టి తెలుస్తోంది. దాంతో ఇక హయత్‌నగర్, సరూర్‌నగర్ మండలాల్లోని నాటి పల్లెల ప్రజలు.. నేటి 'మహానగరం'లో నివాసితులుగా మారబోతున్నారు. పట్టణ వాతావరణాన్ని అలవాటు చేసుకోవడానికి ఎంత కాలం పడుతుందోనని కొందరు స్థానిక పెద్దలు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం!

బడంగ్‌పేట్‌లోనే ప్రత్యేక జోన్ ఏర్పాటు

● చార్మినార్‌లో విలీనం తాత్కాలిక పాలన కోసమే

● మాజీ మేయర్ పారిజాతారెడ్డి వెల్లడి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో చేర్చడం తాత్కాలిక పాలనా సౌలభ్యం కోసమేనని భవిష్యత్తులో ఇక్కడే ప్రత్యేక జోన్ ఏర్పాటు కాబోతోందని బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్‌లో కలిపారంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆమె స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎం కార్యాలయంలోని మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణను వేర్వేరుగా కలిసి బడంగ్‌పేట్‌ను ఎల్బీనగర్ జోన్‌లో కలపాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అధికారులు జారీ చేసిన జీవోలో కేవలం తాత్కాలికంగా అధికారులను చార్మినార్ జోన్ కిందకు తీసుకువచ్చినట్టు మాత్రమే ఉన్నదని, మొత్తం బడంగ్‌పేట్‌ను అందులో విలీనం చేయలేదని స్పష్టం చేశారు. గ్రేటర్ కమిషనర్ సైతం తమకు ఇదే విషయం స్పష్టంగా చెప్పారని ఆమె పేర్కొన్నారు. తాము బడంగ్‌పేట్ పేరుతోనే జోన్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతూ ఇక్కడ ఉన్న ఆధునిక భవనాలు, అన్ని రకాల మౌలిక వసతులను ఆయనకు వివరించామని మాజీ మేయర్ చెప్పారు. బడంగ్‌పేట్‌ను ఆనుకుని ఉన్న ఆదిబట్ల, జల్‌పల్లి, తుక్కుగూడ, తుర్కయాంజాల్‌ను బడంగ్‌పేట్‌తో కలిసి జోన్‌గా ఏర్పాటు చేస్తే బాగుంటుందని తాము ఆయనకు వివరించామన్నారు. కొత్త జోన్ల ఏర్పాటు సమయంలో బడంగ్‌పేట్ పేరును తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారని పారిజాతారెడ్డి తెలిపారు. ప్రస్తుతం వివిధ పార్టీల నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఆమె కోరారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులను కలుస్తామని, వారి నుంచి కచ్చితమైన హామీ తీసుకుని స్థానికులకు న్యాయం జరిగేలా చూస్తామని పారిజాతారెడ్డి పేర్కొన్నారు.

నేడు బడంగ్‌పేట్ బంద్‌కు బీజేపీ పిలుపు

సరూర్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్‌లో విలీనం చేయడానికి నిరసనగా బీజేపీ బడంగ్‌పేట్ శాఖ ఆధ్వర్యంలో శనివారం బడంగ్‌పేట్ బంద్‌కు పిలుపునిస్తున్నట్టు పార్టీ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డిలు ప్రకటించారు. నాయకులు, ప్రజలు పార్టీలకతీతంగా ఈ బంద్‌కు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బడంగ్‌పేట్‌కు చార్మినార్ నుంచి విముక్తి కల్పించడమే తమ అంతిమ లక్ష్యమని వారు పేర్కొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి జిస్మత్ మండీని ప్రారంభిస్తున్న నటుడు ధర్మ మహేశ్

జిస్మత్ మండీ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు ధర్మ మహేశ్ తన సొంత 'జిస్మత్ మండీ' రెండో బ్రాంచిని చైతన్యపురిలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భోజన ప్రియులకు నాణ్యతతో కూడిన, నోరూరించే వంటకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. తన కుమారుడు జగద్వాజ పేరు కలిసి వచ్చేలా గిస్మత్ మండీని, జిస్మత్ మండీగా మార్చి ఆతిథ్య రంగంలో సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రతి బిర్యానీ ప్లేట్, అతిథుల ప్రతి చిరునవ్వు, ఆహ్లాదాన్ని కలిగి ఉంటాయన్నారు. అలాగే రుచి, నాణ్యత, ఆప్యాయతలు కొత్త గుర్తింపునకు మరింత బలాన్ని చేకూరుస్తాయన్నారు. రానున్న రోజుల్లో జిస్మత్ బ్రాండ్ మరింత బలోపేతం అవుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తుర్కయంజాల్‌పై స్పష్టమైన జీవో విడుదల చేయండి

● బీజేపీ డిమాండ్

హయత్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ సర్కిల్‌ను చార్మినార్ జోన్ నుంచి తొలగించి ఎల్బీనగర్ జోన్‌లోకి మార్చినట్లు జీవో విడుదల చేయాలని బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్‌లు డిమాండ్ చేశారు. తుర్కయంజాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తుర్కయంజాల్ సర్కిల్‌ను ప్రభుత్వం చార్మినార్ జోన్‌లో కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని, దానిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేయడంతో అధికారులు దిగివచ్చి తుర్కయంజాల్ సర్కిల్‌ను ఎల్బీనగర్ జోన్‌లో కలుపుతున్నట్లు ప్రకటించి రికార్డులు తీసుకువెళ్లారని అన్నారు. ఎలాంటి జీవో లేకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు తుర్కయంజాల్ సర్కిల్‌ను ఎల్బీనగర్‌లో కలుపుతున్నట్లు ప్రకటించారన్నారు. ఈ విషయమై స్పష్టమైన జీవో విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్త రాంరెడ్డి, నర్సింహగౌడ్, పురుషోత్తం, బల్‌దేవ్‌రెడ్డి, గుండ కృష్ణ, నాగరాజు, రవీందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● క్యాలెండర్ ఆవిష్కరణ



వనస్థలిపురంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన సంవత్సరం-2026 క్యాలెండర్‌ను ఆలయ చైర్మన్ లక్ష్మయ్య శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్లు పాపారావు, గణపతి, కోశాధికారి శ్రీధర్, జాయింట్ కోశాధికారి రామలక్ష్మి, సభ్యులు సాంబశివరావు, సునీల్‌గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


- మన్సూరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి)

పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు అందజేత



పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లను అందజేసిన ఎస్‌బీహెచ్ గిల్డ్ ట్రస్ట్ సభ్యులు

ఎల్బీనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంకు చెందిన ఎస్‌బీహెచ్ గిల్డ్ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం ఎల్బీనగర్‌లోని బ్యాంకు కాలనీలో పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి గోపికృష్ణలు మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా రిటైర్డయిన ఎస్‌బీహెచ్ సీనియర్ అధికారులతో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. రిటైర్డయిన వారి పెన్షన్ నుంచి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి ఈ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద, దిగువ మధ్యతరగతి వారికి ఆర్థిక చేయూత అందించడంతో పాటు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.



సీఐటీయూ రాష్ట్ర మహాసభల పోస్టరును ఆవిష్కరిస్తున్న జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లయ్య తదితరులు

సీఐటీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

చంపాపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లో ఈ నెల 7 నుంచి 9 తేదీలలో నిర్వహించనున్న సీఐటీయూ రాష్ట్ర ఐదవ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య కోరారు. హస్తినాపురం డివిజన్ నందనవనంలో సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ మాజీ అధ్యక్షుడు కుంటిగొర్ల రాములు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఎల్లయ్య ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, లలిత, అంజమ్మ, బుచ్చమ్మ, రమణమ్మ, పకీరమ్మ, ఉమారాణి పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

సర్పంచ్‌కు 84, వార్డులకు 449 నామినేషన్లు



కవాడిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కరుణాకొండల్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం శుక్రవారం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు ఆఖరి రోజు కావడంతో ఆయా పార్టీలు బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నామినేషన్‌పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. మండలంలోని 14 సర్పంచ్ స్థానాలకు 84 మంది, 134 వార్డు స్థానాలకు గాను 449 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. మొత్తం నామినేషన్ల సంఖ్య 533కు చేరుకుంది.

గ్రామాల వారీగా నామినేషన్ల వివరాలు..

అబ్దుల్లాపూర్‌మెట్‌లో సర్పంచ్‌కు 7, వార్డులకు 71, కవాడిపల్లిలో సర్పంచ్‌కు ఆరు, వార్డులకు 30, బలిజగూడలో సర్పంచ్‌కు 6, వార్డులకు 27, బాటసింగారంలో సర్పంచ్‌లకు 7, వార్డులకు 39, పిగ్లీపూర్‌లో సర్పంచ్‌కు 6, వార్డులకు 19, జాఫర్‌గూడలో సర్పంచ్‌కు 2, వార్డులకు 27, బండరావిరాలలో సర్పంచ్‌కు 9, వార్డులకు 34, చిన్నరావిరాలలో సర్పంచ్‌కు 4, వార్డుకు 18, అనాజ్‌పూర్‌లో సర్పంచ్‌కు 9, వార్డులకు 53, మజీద్‌పూర్‌లో సర్పంచ్‌కు 7, వార్డులకు 31, గుంతపల్లిలో సర్పంచ్‌కు 4, వార్డులకు 16, లష్కర్‌గూడలో సర్పంచ్‌కు 5, వార్డుకు 35, ఇనాంగూడలో సర్పంచ్‌కు 5, వార్డుకు 26, గండిచెరువులో సర్పంచ్‌కు 7, వార్డుకు 23 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

లెప్రసీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



లెప్రసీ బాధితులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆనంద్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పెద్దఅంబర్‌పేట్ సర్కిల్ పరిధిలోని శాంతినగర్ (లెప్రసీ) కాలనీలో ఆశ్రయం, హ్యాండ్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది లెప్రసీ వ్యాధిగ్రస్థులకు హ్యాండ్ ఆఫ్ హోప్ వాలా డా.ఆనంద్ దివాకర్ ఉచితంగా రక్త, బీపీ, షుగర్, ఎక్స్‌రే, ఈసీజీ, కంటి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. అదే విధంగా 60 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న స్లాప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మనియాద రమేశ్ మాట్లాడుతూ, లెప్రసీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. డాక్టర్స్ అభిషేక్, నందిని, మనోజ్ఞ, శ్రీధర్, క్యాంప్ టీం లీడర్ జయరాజు, ఆశ్రయం పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్ ఇమ్మాన్యుయేల్, స్వామి, శ్యామూల్, డామిని, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.